www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 27 జూన్ 2025
5
కాకినాడ



కలుషిత నీటిని తాగేదెలా..?



ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

నాగులపల్లి రక్షిత మంచినీటి పథకం ద్వారా మండల ప్రజలకు శుద్ధిచేసిన తాగునీరు అందిస్తున్నారు. అయితే గురువారం కుతుకుడిమిల్లి గ్రామంలో కుళాయిల ద్వారా సరఫరా చేసిన తాగునీరు బురదమయంగా రావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కలుషిత జలాలు రావడంతో ఈ నీటిని ఎలా తాగాలని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే వాతావరణ మార్పులతో జ్వరాలు వస్తున్నాయని, ఈ తరుణంలో కలుషిత జలాలు తాగితే మరింతగా రోగాల బారిన పడతామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కలుషిత నీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

విజ్ఞాన కేంద్రం, మ్యూజియం ప్రారంభం

పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి, రాజానగరం

సైన్స్ రంగంలో విశేష పరిశోధనలు చేసిన ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని గొరగనమూడికి చెందిన స్వామి జ్ఞానానంద పేరును విజ్ఞాన కేంద్రానికి పెట్టాలని యోచిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు. రూ.15.20 కోట్లతో అభివృద్ధి చేసిన రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రాన్ని గురువారం కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎంఎల్‌సి సోము వీర్రాజు, ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతితో కలసి మంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల ఆసక్తిని పెంచడానికి ఈ విజ్ఞాన కేంద్రం దోహదం చేస్తుందన్నారు. విజ్ఞాన కేంద్రాన్ని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం సహకారంతో నిర్మించినట్టు తెలిపారు. గోదావరి జిల్లాల్లో శాస్త్ర సాంకేతిక రంగంలో ఈ విజ్ఞాన కేంద్రం ఒక మైలురాయిగా నిలిచిపోతుందని చెప్పారు. విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు విజ్ఞాన కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు పంతం నానాజీ, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నేషనల్ సెంటర్ ఫర్ సైన్స్ మ్యూజియం డైరెక్టర్ జనరల్ చౌదరి, వివిటిఎం డైరెక్టర్ సాజూ భాస్కరన్, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, ప్రొఫెసర్ డాక్టర్ కె.శరత్ కుమార్, డైరెక్టర్ శ్రీనివాస్, ఆర్‌డిఒ కృష్ణ నాయక్, జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు, జెడ్‌పి సిఇఒ లక్ష్మణరావు పాల్గొన్నారు.

అటవీ అకాడమీ శిక్షణా కేంద్రం ప్రారంభం

రాష్ట్రంలో 23 శాతం భూభాగం పచ్చదనంతో కలిగి ఉండేలా చర్యలు తీసుకోవడంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో అటవీ ప్రాంతాల అభివద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక దివాన్ చెరువు అటవీ శాఖ శిక్షణా కేంద్రంలో శాశ్వత భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో అటవీ అకాడమీ శిక్షణ కేంద్రం శాశ్వత భవనానికి రూ.18 కోట్లతో శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. భవిష్యత్తు తరాల కోసం పచ్చదనం కలిగిన ప్రాంతాల్ని అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని 23 శాతం వరకు పెంచాలనే సంకల్పంతో క్యాబినెట్‌లో ప్రత్యేకంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా తొలిదశలో 50 శాతం మేరకు లక్ష్యాలను సాధించేందుకు పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చేసినట్టు తెలిపారు. రాజమహేంద్రవరంలోని తాత్కాలిక శిక్షణ కేంద్రంలో రూ.18 కోట్ల 34 లక్షలతో శాశ్వత శిక్షణా భవనానికి శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎంఎల్‌ఎలు బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామ కృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఎస్‌పి డి.నరసింహా కిషోర్, ఎపిఎఫ్‌డిసి డాక్టర్ ఆర్‌పి ఖజూరియా, ఎపిసిసిఎఫ్ డాక్టర్ రాహుల్ పాండే, స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డాక్టర్ శాంతి ప్రియా పాండే, డాక్టర్ బి.విజయ్ కుమార్, బిఎస్ఎన్.మూర్తి, ఆర్ఎం టి.జ్యోతి పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



ఆశ వర్కర్ల యూనియన్ మండల మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శేషబాబ్జి

వలస పాలన చట్టాలను మరిపిస్తున్న మోడీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

బ్రిటిష్ కాలంలో అమలు చేసిన చట్టాలను మరిపించేలా మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలు ఉన్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి ధ్వజమెత్తారు. గురువారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1978లో జనతా ప్రభుత్వం, 1998లో బిజెపి ప్రభుత్వం అనేక కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చాయని, ఆ చట్టాలను కార్మికవర్గం పోరాటాలతో తిప్పికొట్టామని గుర్తు చేశారు. దేశంలో నూతన ఆర్థిక విధానాలు అమలు చేసినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 24 సమ్మెలు జరిగాయన్నారు. మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్మిక, రైతు, వ్యవసాయ విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా కార్మిక, ప్రజా సంఘాలు ఏడాది జూలై 9న సార్వత్రిక సమ్మెను చేసేందుకు పిలుపునిచ్చాయని అన్నారు. మండలంలోని కార్మిక వర్గం అంతా ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 2024 ఫిబ్రవరిలో నాటి ప్రభుత్వం, 2025 ఫిబ్రవరిలో కూటమి ప్రభుత్వం ఆశాలకు చేసిన ఒప్పందాలను అమలు చేయడం లేదనిఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమల్ల పద్మ అన్నారు. కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ పథకాలన్నింటినీ ఆశాలకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆశాలకు కురిపిస్తున్న వరాల జల్లు టివిలలో చూసి ఆనంద పడటం తప్ప అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటివరకూ సంఘం చేసిన కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్ కర్తవ్యాలను నిర్ధేశించుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ మండల కమిటి ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా పెయ్యల అనంత లక్ష్మి, రాయుడు నాగలక్ష్మి, కోశాధికారిగా దున్నా మణి, ఉపాధ్యక్షులుగా పత్తి గనికమ్మ, సంగాడి కళావతి, జొన్నలగడ్డ పుష్పావతి, మోర్త శారదా దేవి, సహాయ కార్యదర్శులుగా బలసాడి భవాని, గుత్తుల శ్రీదేవి, చింతా భారతి, వడ్డి అనంతలక్ష్మి, మడికి చంద్రావతి ఎన్నికయ్యారు.



నూతన అధ్యక్ష, కార్యదర్శులు

విద్యామిత్ర కిట్ల పరిశీలన

ప్రజాశక్తి - గొల్లప్రోలు, పిఠాపురం

గొల్లప్రోలు జడ్‌పి బాలికోన్నత పాఠశాలను సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర రాష్ట్ర పరిశీలకులు చుక్కా భాస్కర్‌రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారా? లేదా? అనే అంశాలపై ఆరా తీశారు. జూలై 5వ తేదీన విద్యార్థులంతా ప్రభుత్వం అందజేసిన యూనిఫాంను ధరించి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాల రికార్డులు, మండల రిసోర్స్ కేంద్రంలో ఉన్న విద్యామిత్ర కిట్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే పిఠాపురంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికొన్నత పాఠశాలను విద్యా మిత్ర రాష్ట్ర పరిశీలకులు చుక్కా భాస్కర్‌రావు తనిఖీ చేశారు. పాఠశాల రికార్డ్సును తనిఖీ చేశారు. ఈ పర్యటనలో సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబైలైజేషన్ అధికారి చామంతి నాగేశ్వరరావు, గొల్లప్రోలు ఎంఇఒ వెంకటశివప్రసాద్, ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం పాపారావు, సిఆర్‌ఎంటిలు రామకృష్ణ, నాగేశ్వరరావు, పిఠాపురం ఎంఇఒలు జి.శ్యాంబాబు, కెటి.నారాయణదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేతన బకాయిల కోసం ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. అడిగిన వారందరికీ రెండు నెలల పాటు పనులు కల్పించాలని, రూ.300 వేతనం కచ్చితంగా ఇవ్వాలని, మేట్లకు పారితోషం ఇవ్వాలని, కూలీలకు చెల్లించాల్సిన బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పులపకూర గోపాలకృష్ణ, బీర వెంకటేశ్వరరావు, గోడి భాస్కరరావు, ధోనం వీర్రాజు, సునీత, అనసూయ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణకు చర్యలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తి గ్రామంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రంలో డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పర్యవేక్షకులు అహ్మద్ భాష మాట్లాడుతూ డయేరియా వ్యాధి భారిన పడిన వారికి డీహైడ్రేషన్ రాకుండా ఒఆర్ఎస్, జింకు బిళ్ళలు ఇవ్వాలన్నారు. కాచి చల్లార్చిన నీరు, ఉప్పు, పంచదార ద్రావణం, అన్నం పొంగు నీరు, పల్చటి మజ్జిగ, బార్లీ, కొబ్బరి బొండం నీరు క్రమ పద్ధతిలో ఇవ్వాలన్నారు. అలాగే తల్లిపాల ఆవశ్యకతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశాలు నిట్ల ఉమాదేవి, కడప సూర్యచక్రం, తదితరులు పాల్గొన్నారు.

పిజి సెట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు

ప్రజాశక్తి - జగ్గంపేట

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎపి పిజిసెట్ 2025లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించారని ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు తెలిపారు. గురువారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనశాస్త్ర విభాగంలో కణితి సోమశేఖర్ 11వ ర్యాంకు, సత్యాల అభిలాష్ 379, సారపు ఉషారాణి 990, సౌండే శ్రీనివాస్ 2729వ ర్యాంక్ సాధించారని తెలిపారు. భౌతిక శాస్త్ర విభాగంలో గుంపని సాయి, రౌతు శివగణేష్ 143వ ర్యాంక్, దన్నన కుసుమ 432వ ర్యాంకను సాధించినట్లు తెలిపారు. వేసవి సెలవులలో రసాయన శాస్త్ర అధ్యాపకులు వారణాసి మల్లి కార్జున శర్మ, భౌతిక శాస్త్ర అధ్యాపకులు గోపాల కృష్ణ రాష్ట్ర వ్యాప్త ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారని, దీనిని ఉపయోగించుకొని తమ కళాశాల విద్యార్థులు మాత్రమే కాకుండా ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నాగేంద్ర 59వ ర్యాంక్, శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని వర్షిత 783వ ర్యాంక్‌ను సాధించారని తెలిపారు. ర్యాంకులను సాధించిన విద్యార్థులను, ఉచిత శిక్షణ అందించిన అధ్యాపకులను ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి కోఆర్డినేటర్ పివివి.సత్యనారాయణ, అకాడెమిక్ కో ఆర్డినేటర్ విశ్వేశ్వర్, ఝాన్సీదేవి, సత్యలత పాల్గొన్నారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కాజులూరు

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం కాజులూరు గ్రామంలో రూ.30.8 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. గత ప్రభుత్వం గ్రామాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో గ్రామాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఇదే గ్రామంలో రూ.19 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు పూర్తి కావస్తున్నాయని, త్వరలోనే వాటిని ప్రారంభిస్తామన్నారు. ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండంగి సరోజినీ, ఎంపిడిఒ రాంబాబు, తహశీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, పంచాయతీరాజ్ జెఇ శేఖర్, ఎపిఒ వెంకటలక్ష్మి, మాజీ ఎంపిపి యాళ్ళ కృష్ణారావు, జనసేన మండల ఇన్‌ఛార్జ్ అన్యం శ్రీరామచంద్రమూర్తి, నాయకులు చూడు చిట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్

కొనసాగిన ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోసం ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 51వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ సెంటర్లోని సమ్మె శిబిరం వద్ద ఇంజనీరింగ్ కార్మికులు వర్షంలో నిలబడి నిరసన తెలిపారు. ఈ శిబిరం వద్ద ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనా లు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు బాసిన భద్రరావు, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, అయ్యప్ప స్వామి, కె.వెంకటరమణ, మలిపెద్ది వీరభద్రరావు, శంకర్, సత్తిరాజు, పచ్చిపాల శ్రీను, డి.సత్తిరాజు, అరుణ్, పాపారావు, బొమ్మన రవికుమార్, సతీష్, నాలం శివ కుమార్, పూల ప్రశాంత్, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమ్మెశిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మండలంలో డిపిఒ పర్యటన

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెద్దాపురపాడు, కొంగోడు గ్రామాల్లో డిపిఒ వి.రవికుమార్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ తీరును ఆయన పరిశీలించారు. చెత్త సేకరణలో అమలు చేస్తున్న విధానాన్ని ఇఒపిఆర్‌డి సలాది వెంకట శ్రీనివాసరావు, కార్యదర్శి పి.వీరభద్రరావును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సేకరణ కొరకు ప్రజల్లో అవగాహన కల్పించి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. గ్రామాలను పరిశుభ్ర తీర్చిదిద్దాలన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న డిపిఒ

తోలుబొమ్మలాట కళాకారుడు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

తోలుబొమ్మలాట కళాకారుడు తోట కొండబాబు (75) గురువారం మృతి చెందారు. స్థానిక పద్మనాభ కాలనీకి చెందిన ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన తూర్పుగోదావరి జిల్లాలో తోలుబొమ్మలాట కళాకారుడుగా పేరు ప్రఖ్యాతులు పొందారు. ఆయన తోలుబొమ్మలాట కళారూపానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనను అనేక కళా సంస్థలు సన్మానించాయి. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. ఆయన మతి వార్త తెలిసిన వెంటనే ప్రజానాట్య మండలి కళాకారులు కేదారి నాగు, మంతెన సత్తిబాబు, రొంగల వీర్రాజు, మహాపాతిన రాంబాబు, దారపురెడ్డి కష్ణ, దారపురెడ్డి సత్యనారాయణ, కుంచే అచ్చారావు, బంగారు రాజు తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.



కళాకారుడు తోట కొండబాబు

ఎనీమియా రక్త పరీక్షలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ అమృతరావు ఆధ్వర్యంలో గురువారం సికల్ ఎనిమియా రక్త పరీక్షలు నిర్వహించారు. ఫ్యామిలీ వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మీ రమణ, శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రాఘవపట్నంలో గ్రామసభ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని సబ్ ప్లాన్ ఏజెన్సీ ప్రాంతమైన రాఘవపట్నం గ్రామ పంచాయతీలో గురువారం ఎంపిడిఒ శివరామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు రౌతులపూడి నుంచి రాఘవపట్నం గ్రామం వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఈ సభలో సర్పంచ్ రాయిపల్లి లోవరాజు, తహశీల్దార్ నరేష్, ఎంఇఒ-2 గాడి కొండబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ గౌతమ్‌కుమార్, ఇతర అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి - కాజులూరు

కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల ఉన్నాయని జనసేన మండల ఇన్‌ఛార్జ్, ఎన్ఆర్ఐ అన్యం శ్రీరామచంద్రమూర్తి అన్నారు గురువారం కాజులూరు జడ్‌పి పాఠశాలలో హెచ్‌ఎం మార్ని విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యా మిత్ర కిట్లను విద్యార్థులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో గతంలో కంటే ఎంతో మెరుగ్గా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం నాణ్యమైన విద్యా మిత్ర కిట్లను విద్యార్థులకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ పెంటపాటి పద్దరాజు, ఎంపిటిసి సభ్యులు షేక్ బాబాజీ, ఉపాధ్యాయులు చింతా నారాయణమూర్తి, కె.హరినాథ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



విద్యా కిట్లు పంపిణీ చేస్తున్న శ్రీరామచంద్రమూర్తి

రైతుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మరాజు చెరువు ఆయకట్టు కాలువల పూడిక తీత పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం కాలువల ఆధునికీకరణను విస్మరించిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు కాలువల పూడికతీత పనులకు రూ.66 లక్షలు, పుష్కర కాలువ పూడికతీత పనులకు రూ.40 లక్షలు, చెరువుల ఆధునికీకరణ పనులకు రూ.20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అనంతరం పేరవరంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.28.60 లక్షలతో నిర్మించనున్న రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, యండగుండి నాగబాబు, నీటి సంఘాల నాయకులు ఎస్‌జివి.సుబ్బరాజు, సామంతుల కిషోర్, జనసేన నాయకులు మేడిశెట్టి బాబి, పెంటకోట మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ వి.సాయి శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

కార్టూ'నిజం'



మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

ప్రజాశక్తి - యంత్రాంగం

నషా ముక్త్ భారత్ కార్యక్రమంపై గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో అవగాహనా ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

గండేపల్లి మండలంలోని ఆదిత్య గ్లోబల్ యూనివర్సిటీలో 18 ఆంధ్ర బెటాలియన్, క్యాంప్ కమాండర్ మేజర్ మహమ్మద్ కె.ఆసిఫ్ ఆధ్వర్యంలో నషా ముక్త భారత్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కాకినాడ ట్రాఫిక్ సిఐ ఎన్.రమేష్ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక అని, యువత మాదకద్రవ్యాల బారిన పడటం మూలంగా దేశ ప్రగతికి విఘాతమని అన్నారు. అనంతరం యూనివర్సిటీలో మాదక ద్రవ్యాలకు వ్యతి రేకంగా శాంతియుత ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ హేమంత్‌కుమార్, ట్రాఫిక్ పోలీసులు, ఎన్‌సిసి అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు. **కాకినాడ** అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో పిఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు యాళ్ళ రత్నారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో టూ టౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ కెవిఎస్.సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.అంజనేయులు, పూర్వ జిల్లా గవర్నర్ కొవ్వూరి మునిరెడ్డి, సమన్వయకర్త ఆర్.రవిశంకర్ పట్నాయక్, క్లబ్ వ్యవస్థాపకులు దిలీప్‌కుమార్ సదనాని, సీనియర్ అడ్వకేట్ సునీల్‌కుమార్ మాట్లాడారు. **జగ్గంపేట** మండలంలోని ఇర్రిపాక ఎంపియుపి పాఠశాల వద్ద సెక్టార్ సూపరవైజర్ అమ్మాజీ అధ్యక్షతన నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఎం.పూర్ణిమ పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.సుధా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం నుంచి రెవెన్యూ డివిజనల్ కార్యాలయం మీదుగా మున్సిపల్ సెంటర్ వరకూ అవగాహన ర్యాలీ జరిగింది. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీహరిరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, సిఐలు జయశంకర్, కృష్ణభగవాన్, ఎస్ఐలు వి.మౌనిక, పివిఆర్.మూర్తి, మున్సిపల్ ఎఇ పివి.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డి.చెన్నరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సిఐ వైఅర్‌కె.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్యాల నిరోధంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.బాలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే వివిధ ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో జగ్గంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, సిడిపిఒ ఎం.పూర్ణిమ, ఎస్ఐలు రఘునాథరావు, యు.శివనాగబాబు, జి.సతీష్, తదితరులు పాల్గొన్నారు. **పిఠాపురం** మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని ఉప్పాడ బస్ స్టాండ్ సెంటర్లో జరిగింది. ఈ సందర్భంగా సిఐ జి.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, విద్యాసంస్థల అధినేతలు, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.



గండేపల్లిలో ఎన్‌సిసి క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్న ట్రాఫిక్ సిఐ రమేష్

నేరాలు ఘోరాలు

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడ గ్రామంలో గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దుర్గాడ గ్రామంలో నివాసం ఉంటున్న ములగపాటి విజయ్‌కుమార్(24) ఆర్‌టిసిలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను ప్రేమించిన అమ్మాయి ఇటీవల మృతి చెందింది. దీంతో మనస్థాపానికి గురైన అతడు మంగళవారం ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. కుటుంబీకులు గుర్తించి అతనని పిఠాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే అతని ఆరోగ్యం విషమించి బుధవారం మృతి చెందాడు. అతని తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి శివారు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సారా బట్టీలపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో 200 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. రౌతులపూడికి చెందిన గొలుసు గోవిందు, పెంకే శ్రీను, నడిగట్ల శ్రీను, గొంప యేసులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారిని తుని కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీ స్వాధీనం

ప్రజాశక్తి - కొవ్వూరు

ఏ విధమైన బిల్లులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఆరు యూనిట్ల లారీని గురువారం పట్టుకున్నామని డివిజనల్ టాస్క్ ఫోర్స్ ఎఎస్ఐ జిఆర్‌కె.గంగాధర్ తెలిపారు. సామర్థ్యానికి మించి అధిక లోడుతో ఇసుక రవాణా చేసినా, అక్రమంగా బిల్లులు లేకుండా ఇసుక రవాణా చేసినా వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

అన్నదేవరపేటలో గురువారం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి గాయాల పాలయ్యాడు. తాళ్లపూడి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అన్నదేవరపేటకు చెందిన కొయ్య ముత్యాలు (25) ఠాగూర్ ఫ్యాక్టరీలో విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఎస్‌కె.సుధీర్ బైకుపై వెళుతూ రెండు బైకులూ ఢీకొనడంతో ముత్యాలు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాల పాలైన సుధీర్‌ను 108 వాహనంలో గోపాలపురం ఆసుపత్రి తరలించామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

ప్రమోషన్ కల్పించాలని ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - సామర్లకోట

తమకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ సచివాలయాల్లోని మహిళా పోలీసులు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పకు వినతిపత్రం అందజేశారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని మహిళా పోలీసులు అచ్చంపేటలో ఎంఎల్ఎను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు మాట్లాడుతూ తమకు జరిపే బదిలీలు పారదర్శకంగా జరిగే విధంగా చూడాలన్నారు. అలాగే తాము మధర్ డిపార్టుమెంట్లో పని చేసే విధంగా ఏర్పాటు చేయాలనికోరారు.

క్రైం ఎఎస్ఐకి డిఎస్‌పి పరామర్శ

ప్రజాశక్తి - సామర్లకోట

క్రైం ఎఎస్ఐగా పనిచేస్తున్న గంగిరెడ్డి బలరామ్‌ను డిఎస్‌పి డి.శ్రీహరి రాజు గురువారం పరామర్శించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విధులకు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు డిఎస్‌పి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షునిగా బలరామ్ పని చేశారు. ఈ పరామర్శలో ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఉదయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు, సీతారామపురం, కోరంగి, గాడిమొగ, భైరవ-పాలెం ఇండస్ట్రీలు, ఆక్వా ఏరియాలకు ట్రీ ట్రిమ్మింగ్‌లో భాగంగా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాడి రైతులకు సబ్సిడీపై దాణా పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని కె.గంగవరం పామర్రు పరిసర ప్రాంతాల్లో గల పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై దాణా పంపిణీ చేశారు. మండల పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. సుమారు 55 మంది రైతులు దానా ప్యాకెట్లను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లూరి దొరబాబు, పశుసంవర్ధక శాఖ ఎడి ఒ.రామకృష్ణ, పసువైద్యులు నాగ శ్రావణి, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కాలేరు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం గ్రామ సర్పంచ్ దాయం కావేరి శేఖర్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు అందిస్తున్న భోజనాన్ని,వివరాలను, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలసి భోజనాన్ని రుచి చూశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ బక్కి సంధ్యారాణి పాల్గొన్నారు.

యానాం వార్తలు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్ఐఎ మునిస్వామి

మాదకద్రవ్యాలతో జీవితాలు నిర్వీర్యం

ప్రజాశక్తి - యానాం

మాదకద్రవ్యాలతో జీవితాలను నిర్వీర్యం చేసుకోవద్దని ఆర్ఎఎ మునిస్వామి సూచించారు. గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్య నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక సర్వ శిక్ష అభియాన్ కాన్ఫరెన్స్ హాల్లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలు నిర్వీర్యం చేసుకుంటున్నారన్నారు. జీవితం బాగుండాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్, విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణప్రవీణ్, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణసుధాకర్, ఎస్ఐలు పునీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, సైబర్ కమాండో యడ్ల శాంతి, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా రీజనల్ లెవెల్ స్కూల్ గేమ్స్

ప్రజాశక్తి - యానాం

స్థానిక మహాత్మా గాంధీ బాలుర పాఠశాలలో రీజనల్ లెవెల్ స్కూల్ గేమ్స్ ఉత్సాహంగా జరిగాయి. గురువారం క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. అండర్ -17 బాలుర విభాగంలో మొదటి స్థానంలో రీజెన్సీ జూనియర్ కళాశాల, ద్వితీయ స్థానంలో రీజెన్సీ పబ్లిక్ స్కూల్, తృతీయ స్థానంలో యానాం పబ్లిక్ స్కూల్ నిలిచాయి. అండర్ - 14 విభాగంలో మహాత్మా గాంధీ బాలుర హైస్కూల్ మొదటి స్థానం, రీజెన్సీ పబ్లిక్ హైస్కూల్ ద్వితీయ, రాజీవ్‌గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణప్రవీణ్, హెచ్ఎం సొంటెనం వలీ, వ్యాయామ ఉపాధ్యాయులు పాము సత్యనారాయణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

28న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

స్థానిక 132 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఈ నెల 28వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు యానాం నియోజవర్గంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

త్వరలోనే సురక్షిత తాగునీరు

ప్రజాశక్తి - తాళ్లరేవు

త్వరలోనే కోరంగి పంచాయతీ బొడ్డు చినవెంకటాయపాలెం ప్రజలకు సిపిడబ్ల్యూ పథకంలో సురక్షిత తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సుకీర్తి తెలిపారు. గురువారం బొడ్డు చిన వెంకటాయపాలెం కుళాయి చెరువు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కుళాయి చెరువులో ఉన్న చేపలు చనిపోవడం వల్ల దుర్గంధం వెదజల్లుతుందని, చెరువులో ఉన్న నీరు పూర్తిగా బయటకు తరలించి చెరువు క్లీనింగ్ చేపట్టినట్లు తెలిపారు. మరో పది రోజుల్లో సురక్షిత తాగు నీటిని ప్రజలకు అందిస్తామని అన్నారు. అప్పటి వరకు రోజు విడిచి రోజు రా వాటర్‌ను ఫిల్టర్ ద్వారా శుభ్రం చేసి, క్లోరినేషన్ చేసిన తర్వాత కుళాయిల ద్వారా సరఫరా చేస్తామన్నారు. ఈ




మీడియాతో మాట్లాడుతున్న ఎఇ సుకీర్తి

కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజెవి. రమణ, స్థానిక నాయకులు పెయ్యల శ్రీనివాస్, కోరంగి మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీ నరసింహ రాజు, మాజీ ఎంపిటిసి సభ్యులు వైదాడి శ్రీనివాస్, కూటమి పార్టీల నాయకులు టేకుమూడి లక్ష్మణ రావు, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, కొప్పిశెట్టి సుబ్బారావు, కొప్పాడి చంటి పాల్గొన్నారు.

సుబేదార్ వినోద్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆవ రేషన్ సింధూర్‌లో పాల్గొని తన స్వగ్రామమైన పెద్దాపురానికి వచ్చిన సైనికుడు సుబేదార్ దడాల వినోద్‌ను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గురువారం స్థానిక వత్సవాయి భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వినోద్ సింధూర్ యుద్ధంలో తన అనుభవాలను



సుబేదార్ వినోద్‌ను సత్కరిస్తున్నఎంఎల్ఎ చినరాజప్ప

వివరించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడ్డం పెదకాపు, కూటమి పార్టీల నాయకులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, మహమ్మద్ ఆరిఫ్ ఆలీ, పాలమరశెట్టి సత్తిబాబు, లక్ష్మణ్ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసేవారు తప్పనిసరిగా హెల్మెట్‌ను వినియోగించాలని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని కాట్రావులపల్లిలో హెల్మెట్ ధారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం తలకు గాయం కావడం ద్వారానే చనిపోతున్నారన్నారు. తలకు గాయం కాకుండా ఉండేందుకు ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం గ్రామ టిడిపి నాయకులు ముసిరెడ్డి నాగేశ్వరరావు



హెల్మెట్‌ను అందజేస్తున్న సిఐ శ్రీనివాస్

12 మందికి హెల్మెట్లను లాటరీ ద్వారా ఎంపిక చేసి ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రఘునాథరావు, సిబ్బంది, సోషల్ యాక్టివిటీ యడ్లపల్లి రమేష్, సుంకర సీతారాముడు, పి.ధర్మానంద్‌కుమార్‌శాస్త్రి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను సొసైటీ మాజీ అధ్యక్షులు, టిడిపి నాయకులు పరిమి బాబు గురువారం పరామర్శించారు. ఇటీవల గ్రామానికి చెందిన ఒక యువతి ప్రమాదవశాత్తు మృతి చెందింది. ఆమె తల్లి వల్లూరి పద్మను ఆయన పరామర్శించారు. అలాగే ఎడ్ల తాతారావు తల్లి మృతి చెందడంతో వారి కుటుంబ



ఎడ్ల తాతారావు పరామర్శిస్తున్న బాబు

సభ్యులను ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో సుంకవల్లి రమేష్, పైపూరి సారంగబాబు, జి సత్యనారాయణ పాల్గొన్నారు.

వారపు సంత వెలవెల

ప్రజాశక్తి - ఏలేశ్వరం

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో కురుస్తున్న వర్షాలతో గురువారం ఏలేశ్వరంలో నిర్వహించే వారాంతపు సంత వెలవెలబోయింది. సుదూర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడి సంతకు వచ్చి దుకాణాలను ఏర్పాటు చేశారు. సంతలో కూరగాయలు, మసాలా దినుసులు, నిత్యవసరాలు తాత్కాలిక దుకాణాల ద్వారా అమ్మకాలు జరుపుతారు. ఇప్పటికే ఏజెన్సీ మండలాల నుంచి ఏలేశ్వరం కొచ్చే రహదారి



కొనుగోలుదారుల కోసం చూస్తున్న వ్యాపారులు

శిథిలావస్థకు చేరుకోవడంతో గిరిజనులు సంతలకు రావడం తగ్గిపోయింది. దీంతో వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. సంతకు వచ్చే గిరిజనులు రాకపోవడంతో సంతకు తెచ్చిన సరుకులను తిరిగి వెనక్కు పట్టుకుపోవాల్సి వస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎఐఎఫ్‌టియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పిఠాపురం

అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య(ఎఐఎఫ్‌టియు) 34వ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సంఘం అధ్యక్షులు కుంచె అంజిబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సూర్యరాయ గ్రంథాలయ ప్రాంగణంలో మహాసభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం మహాసభను సూర్యరాయ గ్రంథాలయ ప్రాంగణంలో జూలై 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలో



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్మికులు, అభ్యుదయవాదులు, ప్రజా కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్‌టియు నాయకులు డి.నారాయణమూర్తి, మడికి సత్యం, గుడాల చార్లెస్, బొచ్చ యేసు, వల్లూరి రాజబాబు, బి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ బి.శ్రీలలిత సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామాలలోని ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరపాలన్నారు. నిర్ణీత సమయంలో మంచినీటి ట్యాంకులను పరిశుభ్రం చేయాలన్నారు. మురికి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలలిత

కాలువలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయటంతో పాటు గ్రామ పరిధిలో చెత్తను ప్రతీ రోజు తొలగించాలన్నారు.

In The Court of The Motor Accident Claims Tribunal (Hon'ble Prl. District Judge) W.G.Dt, Eluru

M.V.O.P.No. 370/2024

Between:

Bale Haritha & 2 others ...**Petitioners**

And

Motukuri Simhachalam & 2 others ...**Respondents**

పై నెంబరు గ్రంథంలో **1వ రెస్పాండెంట్:** మొటుకూరి సింహాచలం, S/o. నూకరాజు డ్రైవర్ ఆఫ్ లారీ బేరింగ్ No. Ap 39 UC 8389. R/o. D.No. 1-306, S.C. కాలని, జగన్నాథపురం విలేజ్, ప్రత్తిపాడు మండలం, కాకినాడ జిల్లా.

అను వారికి నోటీసు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది.03-07-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

C.V. Surya Krishna
Advocate
Tangellamudi, Eluru
Cell: 83416 64461

ఏలూరు
తేది:25-06-2025

అందరి సహకారంతోనే మండలాభివృద్ధి

ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన భూపతిరాజు తులసి కృష్ణ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అందరి సహాయ సహకారాలతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపిడిఒగా గురువారం బాధ్యతలు చేపట్టిన భూపతిరాజు తులసి కృష్ణ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న తులసి కృష్ణ ఎంపిడిఒగా పూర్తి అదనపు బాధ్యతలను చేపట్టారు. ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన తులసి కృష్ణని మండల విద్యాశాఖ అధికారులు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ, పిఆర్ ఎఇ, వి.రాధాకృష్ణ, ఉపాధి ఎపిఒ ఎం.వీరబాబు, కార్యాలయ సిబ్బంది ఉపాధ్యాయులు ఉపాధి సిబ్బంది తదితరులు



ఎంపిడిఒ తులసి కృష్ణని అభినందిస్తున్న ఉద్యోగులు

మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

డివిజన్‌లో 389.6 మిల్లీమీటర్ల వర్షం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలోని 11 మండలాలలో గురువారం 389.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మండలాల వారిగా కోటనం దూరులో 29.2, తునిలో 26.8, రౌతులపూడిలో 33.6, శంఖవరంలో 42, ఏలేశ్వరంలో 19.8, జగ్గంపేటలో 38.4, కిర్లంపూడిలో 31.2, ప్రత్తిపాడులో 32.8, తొండంగిలో 51.6, పెద్దాపురంలో 39.6, గండేపల్లిలో 42.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయింది.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

పటవల పంచాయతీ శాంత మూలలో పాముకాటుకు గురై మృతి చెందిన విద్యార్థి వడ్డి సంజన కుటుంబాన్ని జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, స్థానిక నాయకులు కొప్పిశెట్టి



నగదును అందిస్తున్న జడ్‌పిటిసి

వెంకట్ పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.7 వేలు సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కొటికలపూడి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతకి ప్రాధాన్యత ఇవ్వాలని డిపిఒ డి.శాంతాలక్ష్మి సూచించారు. పాశర్లపూడి, ఈదరాడ గ్రామాలలో గురువారం సందర్శించి పారిశుధ్య పనులు పరిశీలించారు ప్రస్తుతం వర్షాకాల సీజన్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలు సహకారం అందించాలని కోరారు తడి,పొడి చెత్త సేకరణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. తడి,పొడి చెత్త వేరువేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించడంతో పంచాయతీలకు ఆర్థిక వనరులు సమకూరుతాయన్నారు. ఆమె



తడి, పొడి చెత్త సేకరణ పై అవగాహన కల్పిస్తున్న డిపిఒ

వెంట ఇఒపిఆర్‌డి అడబాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి పివిఆర్‌కె.రాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ పనుల తనిఖీ

ప్రజాశక్తి - పెద్దాపురం

సాంబమూర్తి రిజర్వాయర్ వాటర్ వర్క్స్ పనులను గురువారం మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్లు, ఇంజనీరింగ్ అధికారులు



వాటర్‌వర్క్స్‌ను పరిశీలిస్తున్న నెక్కంటి

పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ సాయిప్రసాద్ వాటర్ వర్క్స్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ పివి.సుధాకర్, మున్సిపల్ కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కర్ పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కె. గంగవరం మండలం, దంగేరు గ్రామ కాపురస్తులు, వ్యవసాయదారులు శ్రీ ప్రతిపాటి దొరయ్య వెంకట రమణమ్మ గార్ల కుమారుడు శ్రీ ప్రతిపాటి వెంకట సుబ్బారావు గారు మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా:

మా క్లయింటు శ్రీ ప్రతిపాటి వెంకట సుబ్బారావు గారికి ది. 01-09-1984వ సంవత్సరంలో దిగువ తెలిపిన షెడ్యూల్ ఆస్తులు మా క్లయింటు పేరున దాఖలు పడినవి. అప్పటి నుండి సదరు దాఖలు పడిన ఆస్తులు మా క్లయింటు స్వాధీనంలో ఉన్నవి. దిగువ షెడ్యూల్ ఆస్తులకి ప్రభుత్వం వారు గతంలో పాస్ పుస్తకములు మా క్లయింటు పేరున మంజూరు చేసియున్నారు. సదరు ఆస్తులు ఇప్పటికీ మా క్లయింటు అనుభవంలోనే ఉన్నవి అని తెలియజేయుచున్నాము.

దిగువ షెడ్యూల్ ఆస్తులపై మా క్లయింటు శ్రీ పత్తిపాటి వెంకట సుబ్బారావుగారికి తప్ప ఇతరులు ఎవరికి, ఎటువంటి హక్కులు లేవని మరియు ఎవరు ఎటువంటి పత్రములు సృష్టించిన అవి అన్నియు చెల్లనేరవని, ఈ దిగు షెడ్యూలు దాఖలు ఆస్తులలో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఎవరు జోక్యం చేసుకున్నా వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు జరిపించబడునని, ఈ దిగువ షెడ్యూల్ ఆస్తులు ఎవరి స్వాధీనంలో ఉన్న అవి అన్నియు ఆక్రమణలు గానే పరిగణించబడునని తెలియజేయుచున్నాము. ఈ ప్రకటన జారీ చేసిన 15 రోజుల అనంతరం ఎవరు జోక్యం చేసుకున్నను, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

షెడ్యూలు: Dr. B.R. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పరిషద్ రామచంద్రాపురం తాలుకా, కపిలేశ్వరపురం పంచాయితీ ఏరియా ద్రాక్షారామ సబ్-రిజిస్ట్రార్ వారి ఆఫీసులో చేరిన దంగేరు గ్రామ పంచాయితీ ఏరియాలోని దంగేరు గ్రామం తాలుకా జిరాయితీ పల్లం:

జిల్లా: Dr.B.R. అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండలం: కె. గంగవరం, S.R.O.: ద్రాక్షారం గ్రామం: దంగేరు

1. రి.సర్వే నెం. 6/7 రు పూరా య.0-24ట్లు
2. రి.సర్వే నెం. 6/8 రు పూరా య.1-14ట్లులో పడమర వైపు య.0-14ట్లుకు హద్దులు:

తూర్పు: ఈ నెంబరులో భూమి. **పడమర:** ప్రతిపాటి వెంకటరమనమ్మగారి భూమి. **ఉత్తరం:** గారపాటి సత్యనారాయణమ్మ గారి భూమి. **దక్షిణం:** పంటబోది.

3. రి.సర్వే నెం. 25/1 రు పూరా య.1-53ట్లు
4. రి.సర్వే నెం. 25/2 రు పూరా య.1-27ట్లు

వెరసి నాలుగు నెంబర్లు మొత్తం య.3-18ట్లుకు హె.1.275ట్లు భూమి అందలి పాత రివాజులు హక్కులు ప్రకారం మాములు రివాజు నడక, నీటి మార్గపు హక్కులు అందలి సర్వంకి హక్కులు.

పిల్లా సూర్యప్రకాశరావు
పిల్లా పి.ఎల్.ఆర్.పి. రామయ్య,
అడ్వకేట్స్, రామచంద్రాపురం
సెల్: 9951435553

రామచంద్రాపురం
ది. 25-06-2025

తిరుమల ఉద్యోగులకు హెల్మెట్ల పంపిణీ

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురానికి చెందిన దాత నిమ్మకాయల సత్యనారాయణ సహకారంతో తిరుమల లోని టిటిడి ఉద్యోగులకు 2000 హెల్మెట్ లను టిటిడి ఛైర్మన్ బిఆర్.నాయుడు చేతులు మీదుగా గురువారం పంపిణీ చేశారు. తిరుమలలోని ఛైర్మన్ అతిథిగహంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగుల భద్రత నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అమలాపురానికి చెందిన వ్యాపారవేత్త , దాత నిమ్మకాయల సత్యనారాయణ రూ.15 లక్షల వ్యయంతో ఈ హెల్మెట్లను సమకూర్చి టిటిడికి అందజేశారు. టిటిడిలోని వాహనాలు నడిపే 10 వేల మంది ఉద్యోగులకు వారి భద్రతలో భాగంగా హెల్మెట్ లను ఉచితంగా అందించాలని భావించామని ఈ కార్యక్రమానికి నిమ్మకాయల సత్యనారాయణ సహకరం అందించడం పట్ల ఛైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.



ఉద్యోగులకు హెల్మెట్ల పంపిణీ చేస్తున్న టిటిడి ఛైర్మన్

ఛైర్మన్ బిఆర్.నాయుడికి, అధికారుకు కృతజ్ఞతలు తెలిపారు.

పేరు మార్పు/ సవరణ

నా కుమార్తె **రేఖ శ్రేష్ఠ,** D/o. **విజయ్‌కుమార్,** డోర్ నెం. 3-42/1, ఎస్.సి.కాలని, పేరవరం గ్రామం, ఏలేశ్వరం మండలం, కాకినాడ జిల్లా.

ప్రస్తుతం నా కుమార్తె డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌లో ఆమె పేరు **రేఖ కావ్య** అని తప్పుగా నమోదు కాబడినది. ఇప్పుడు **రేఖ శ్రేష్ఠ,** D/o. **విజయ్‌కుమార్** గా మార్పు చేయుట జరిగినది. నా కుమార్తె ఆధార్ కార్డు, విద్యా ఉద్యోగం ఇతర లావాదేవీలలో **రేఖ శ్రేష్ఠ** గా పిలవబడును. ఆధార్ విద్యా, ఉద్యోగంలో పేరు మార్పు కొరకు.

కార్మికునికి రూ.50 వేల సాయం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్/అమలాపురం

తమ తోటి కార్మికునికి గురువారం సిఐటి యు అనుబంధంగా ఉన్న క్రేన్ ఓనర్స్, ఆపరేటర్స్ ఆర్థిక సాయం అందజేశారు. పది సంవత్సరాల క్రితం జరిగిన ఒక ప్రమాదంలో పూర్వం క్రేన్ ఆపరేటర్ అయిన మామిడిశెట్టి శ్రీనివాసరావు రెండు కాళ్లు, వెన్నుముక పూర్తిగా చెడిపోవడం వల్ల మంచానికే పరిమిత మయ్యాడు. బాధితుని ఆర్థిక తెలుసుకొని తోటి కార్మికునికి సిఐటియు అనుబంధంగా ఉన్న క్రేన్ ఓనర్స్, ఆపరేటర్స్ అమలా పురం మండలం అప్పిరెడ్డి కాలనీ పితాని వారి పాలెంలో శ్రీనివాసరావుకు ఆయన స్వగృహంలో ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా గోదావరి క్రేన్ ఓనర్స్, ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో విరాళాలుగా సేకరించిన రూ.50వేలు అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు శ్రీనివాసరావు కుటుంబానికి సాయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరు రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలని హెల్మెట్ సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సాయం చేసిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు ఉపాధ్యక్షులు బొంతు గణేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

నిడదవోలు మండలం, సమిశ్రగూడెం గ్రామం, డో.నెం. 1-99/1, కాపురస్తులు, **తురక భవాని శంకర్ తండ్రి: ఏసురత్నం** అను నాయొక్క **పాస్‌పోర్టు నెం.V4832928** ది.15.06.2025వ తేదీన జిరాక్స్ తీయించుకొను నిమిత్తం సమిశ్రగూడెం గ్రామం నుండి నిడదవోలు వచ్చుచుండగా దారి మార్గంలో పడిపోయినది. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు. తగిన పారితోషకం ఇవ్వబడును.

తురక భవాని శంకర్, తండ్రి: ఏసురత్నం
ఫోన్: 9640266463